క్లుప్తంగా

రెడ్డి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి విరాళం



సత్రం కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డికి విరాళం అందజేస్తున్న దాతలు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లికి చెందిన జొన్నలగడ్డ ముకుందారెడ్డి రూ.1,00116, రంగారెడ్డి రూ.50 వేలు, నరసింహారెడ్డి రూ.25 వేల విరాళాన్ని గురువారం స్థానికంగా సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం సాముల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. అన్నదాన సత్రంలో ఆగస్టు 15వ తేదీన మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకా సాదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓలో సభ్యత్వానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలుకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గల ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లో చేరేందుకు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, సీఈఓ చిలువేరు లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం చిలుకూరు పీఏసీఎస్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎఫ్‌పీఓలో సభ్యత్వం తీసుకుంటే రైతులకు అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పవచ్చని తెలిపారు. సభ్యత్వం కలిగిన రైతులకు సబ్సిడీలు, పంట బీమా అందుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌తో పాటు రూ. 2 వేలను కార్యాలయంలో చెల్లించి జీవితకాల సభ్యత్వం పొందవచ్చని తెలిపారు. ఇందులో 750 మంది రైతులు మాత్రమే చేరేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చల్లకుండ ఎత్తే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, భక్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని లక్కవరం గ్రామంలో ఈనెల 10వ తేదీన నిర్వహించబోయే ముత్యాలమ్మ జాతరలో భాగంగా బుధవారం గ్రామంలో చల్లకుండ ఎత్తే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చామకూరి గురుపాదం, ఎడ్ల కోటిరెడ్డి చనగాని సైదులు, నాగార్జునసాగర్, మధు, వెంకటేష్, శ్రీను, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు



సారా స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మోతె : సారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించిన సంఘటన గురువారం మోతె మండల పరిధిలోని రాంపురంతండాలో చోటు చేసుకుంది. మోతె ఎస్‌ఐ టి.వియస్‌కుమార్ తెలిపిన వివరాలు.. రాంపురంతండాలో సారా తయారు చేస్తున్న ఇంటిపై పోలీసులు దాడులు చేసి మూడు లీటర్ల సారాతో పాటు రా మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్మీడియట్ విద్య కీలకం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడరూరల్ : విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య కీలకమైనదని, ఈ దశలో చదువుపై దృష్టి పెడితే భవిష్యత్ బంగారంలా ఉంటుందని టీపీసీసీ సభ్యుడు సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. గురువారం పట్టణంలో ఎస్‌ఆర్‌ఎస్ ఐటీ, మెడికల్ కళాశాల బాయ్స్ క్యాంపస్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వడ్డె రాజేష్ చౌదరి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డేగ శ్రీధర్, కంభంపాటి శ్రీనివాస్, పిడతల అకాడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య, ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు, జీవి తదితరులు ఉన్నారు.

మురుగుకూపంగా నయానగర్

కోదాడ : పట్టణ నడిబొడ్డు నయానగర్‌లో గల మేకల అభినవ్ వీధి మూలమలుపులో ఉన్న ఖాళీ స్థలం మురుగుకూపంగా మారింది. పదేళ్లుగా వర్షాకాలంలో ఇదే దుస్థితి. ఆ స్థలంలో చెత్తాచెదారం పేరుకుపోయి, వర్షపు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది ఆ కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంతంలోనే పాఠశాలలు కూడా ఉన్నాయి. దీంతో మురుగుకూపం నుంచి తమకు విముక్తి లేదా అని నయానగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలకు నిలయంగా మారి విషజ్వరాలు ప్రబలుతున్నాయని పత్రికల్లో వార్తలు వచ్చినా.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోరా అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే మురుగును తీసుకెళ్లి మున్సిపాలిటీ కార్యాలయంలో పోస్తామని నయానగర్‌వాసులు హెచ్చరిస్తున్నారు.



నయానగర్‌లోని ఖాళీస్థలంలో నిలిచిన వాననీరు, పేరుకుపోయిన చెత్త

చినుకుపడితే చిత్తడిగా రహదారి

మునగాల : మండలంలో ఆకుపాముల నుంచి నర్సింహాపురం మధ్య గల రోడ్డు చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. రెండు కిలోమీటర్లు గల ఈ రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. నిత్యం ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే నాలుగు మండలాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారికి నిధులు మంజూరు చేసి తారురోడ్డుగా మార్చాలని గ్రామప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా నర్సింహాపురం రోడ్డు

మునగాలలో భారీ వర్షం

- వాగులను తలపించిన వీధులు
- గణపవరం రోడ్డులో దుకాణాల్లోకి చేరిన వర్షపునీరు



మునగాలలోని గణపవరం రోడ్డులో నిలిచిన వర్షపునీరు

మునగాల : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి ఏడున్నర సమయంలో భారీ వర్షం కురిసింది. సుమారు 40 నిమిషాల పాటు కురిసిన వర్షంతో మునగాలలో వీధులు వాగులను తలపించాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలోని గణపవరం రోడ్డులో ఇరుపక్కల గల పలు దుకాణాల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో యజమానులు ఇబ్బందులు పడ్డారు. రహదారి పక్కన మురుగుకాలువ ఆక్రమణకు గురికావడంతో వర్షపు నీరు రోడ్డు మీదకు చేరి వాగును తలపించింది. మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత వారం రోజులుగా విపరీతమైన ఎండ, ఉబ్బతో అల్లాడిపోయిన ప్రజలు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నట్లయింది. నాన్‌ఆయకట్టు గ్రామాల్లో సాగుచేసిన మెట్టపైర్లకు ఈ వర్షం ప్రాణం పోసింది.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

కోదాడ : ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి గోపాల్ కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కోదాడలోని జాతీయ రహదారిపై గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో చేనేత కార్మికులే అత్యధికంగా అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు వారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోలి నాగరాజు, గౌరె రాజేష్, కొంగర నరసింహారావు, పిండిప్రోలు శ్రీనివాస్, ఆనందం వెంకటరావు, చేరుపల్లి మట్టయ్య, బుద్దారపు శేషగిరి, కల్వకుంట్ల రత్నాకర్, కర్ల సుందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● 'వరలక్ష్మి' సందడి



శుక్రవారం వరలక్ష్మి వ్రతం నేపథ్యంలో కోదాడలోని పూల మార్కెట్ వద్ద గురువారం కొనుగోలుదారుల సందడి నెలకొంది. వాహనాల రద్దీతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. - కోదాడ

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

నేరేడుచర్ల : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకుంటేనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని జేవీవీ జాతీయ కన్వీనర్, డాక్టర్ మువ్వ రామారావు అన్నారు. గురువారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలో గల మహాత్మా జ్యోతిరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగం- శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సైంటిఫిక్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండి పరిశోధనల వైపు అడుగులు వేయాలన్నారు. తెలంగాణ విద్యా వికాస వేదిక వ్యవస్థాపకుడు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ కోరుకున్న అసమానతలు లేని సమాజంగా మారడానికి విద్యార్థులే దిక్సూచి అన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ప్రిన్సిపాల్ అనుకరణ, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, టీచర్లు రమ్య, సంధ్యారాణి, ఇందిరా, మేరీ, విజయకుమారి తదితరులున్నారు.

మూఢనమ్మకాలను పారదోలాలి

నేరేడుచర్ల : ప్రజలు మూఢనమ్మకాలను పారదోలాలని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, సమూహ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిచయం- శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్య వికాసం వేదిక రాష్ట్ర కన్వీనర్ కస్తూరి ప్రభాకర్, జేవీవీ రాష్ట్ర కార్యర్శి కందుకూరి సుదర్శన్, అధ్యాపకులు ప్రణతి, నర్సింహరావు, శ్రీనివాసులు, గణేష్, నర్సింహచారి, ప్రసాద్, వెన్నెల, అపర్ణ, వీరేష్, జేవీవీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల : గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ముప్వా రామారావు

ఏటీసీ, ఐటీఐలలో స్పాట్ అడ్మిషన్లు

హుజూర్‌నగర్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఏటీసీ, ఐటీఐలలో స్పాట్ అడ్మిషన్ కోసం నోటిఫికేషన్ జారీ అయినట్లు జిల్లా ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ జింజిరాల వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు ఏటీసీ, ఐటీఐలలో స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సొంత మొబైల్ నంబర్‌ను iti.telangana. gov. in వెబ్‌సైట్ లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మీరు కోరుకున్న ఏటీసీ, ఐటీఐలో ఆన్‌లైన్ అప్లికేషన్ సమర్పించి మీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు. వీరికి మెరిట్ ప్రకారం అందుబాటులో ఉన్న ట్రేడ్‌లలో సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా జరిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మూడు మేకలు మృతి

మేళ్లచెరువు : మండలంలోని హేమ్లాతండా గ్రామంలో గురువారం కురిసిన వానకు పిడుగుపడి మూడు మేకలు మృతిచెందాయి. మేకల మృతితో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు భూక్యా రామోజీ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

నడిగూడెం : మండలంలోని తెల్లబల్లిలో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పలు వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాశం ప్రవళిక, ఏఎన్ఎం మంగ, ఆశా కార్యకర్త శైలజ, గ్రామ పంచాయతీ సిబ్బంది చేకూరి నాగరాజు, రాములు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

హనుమరెడ్డి మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : మండలంలోని అమరవరం గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు సాముల హనుమరెడ్డి బుధవారం మృతి చెందారు. గురువారం ఆయన మృతదేహాన్ని పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, పార్టీ నాయకులు సుజాత అంజిరెడ్డి, బెల్లంకొండ అమర్, డాక్టర్ కే ఎల్ఎన్ రెడ్డి, కామిశెట్టి వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, సైదేశ్వరరావు, గురువారెడ్డి, ఏ.శౌరెడ్డి, తదితరులు ఉన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ



కోదాడ : చెట్టుకు రాఖీలు కడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోదాడ : చెట్లతోనే మానవ మనుగడ అని, చెట్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ అన్నారు. గురువారం కోదాడ బాలుర పాఠశాలలో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని మొక్కలకు రాఖీలు కట్టి వాటిని సోదరుల వలె చూసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఏక్ భారత్.. శ్రేష్ఠభారత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఎంఈఓకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. గురువారం పాఠశాలలో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెట్లకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, సైదులు, రషీద్, జానకిరాములు, నాగమణి, అన్నపూర్ణ, మాధవి, భానుమతి, జానయ్య, వెంకట్‌రెడ్డి, యాదగిరి, నగేష్, సరస్వతి తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల : వృక్షానికి రాఖీ కడుతున్న విద్యార్థులు

మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలి

- జిల్లా డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో ముమ్మరంగా మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష కోరారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలోని నర్సరీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటికి మొక్కలు పంపిణీని ప్రారంభించాలన్నారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ కుంటల రమేష్‌దీనయాళ్, ఏపీఓ శైలజ, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు సదాలక్ష్మి, కె.అనిత పాల్గొన్నారు.



మాధవరంలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కోదాడరూరల్ : అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ ఆయిల్ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గుడిబండ శివారులో గల అంజన్ ఇండేన్ గ్యాస్ గోడౌన్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇండియన్ ఆయిల్ ఒప్పంద కంపెనీ బ్రాండ్స్ డాడీ రూపొందించిన ఆటో ఫెయిర్ ఎస్టింగ్ మిషన్ బాల్స్‌ను ఇంట్లో, పరిశ్రమలు, విద్యాసంస్థల్లో అమర్చుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఈ బాల్స్ మంటలను నియంత్రిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నల్గొండ సేల్స్ ఆఫీసర్ సంపత్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు శైలేష్, దీపిక, అంజన్‌గౌడ్, రాజశేఖర్, శ్యామ్ ఉన్నారు.



అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న గ్యాస్ కంపెనీ నిర్వాహకులు

రైతు క్షేత్ర పాఠశాల ప్రారంభం



రైతు క్షేత్ర పాఠశాలను ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారులు

మోతె : మండలంలోని అన్నారిగూడెం గ్రామంలో గురువారం కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హోన్నప్పగౌడ పర్యవేక్షణలో రైతు క్షేత్ర పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్ శంకర్ మాట్లాడుతూ.. రైతులు సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. కీటకాల నివారణకు లింగకర్షక బుట్టలు ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారిని అరుణ, బసవన్నప్ప, రేష్మ, వ్యవసాయ విస్తరణాధికారి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ ఎన్నిక



ఎన్నికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

చిలుకూరు : విద్యార్థులకు ప్రజాస్వామిక విలువలు, ఎన్నికల ప్రాముఖ్యత, ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు చిలుకూరు మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్‌ను ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయుడు పి.వీరస్వామి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. బ్యాలెట్ విధానంలో విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా అనునందిని, ఉపాధ్యక్షుడిగా సతీష్, జనరల్ సెక్రటరీగా గోపిచంద్, లైబ్రరీగా అశ్విని, మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జిగా శ్రావణితో పాటు సభ్యులుగా లాస్య, వీణ శ్రీ, సందీప్‌నాయక్, నవదీప్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దిర్శించర్లలో వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గురువారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బంగారు స్వాతి, ఆస్పత్రి బృందం వీరేంద్రాచారి, క్లబ్ జిల్లా చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కీత కనకయ్య, విశ్వనాథం, గంధం శావయ్య, తుమ్మలూరి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన జక్కుల శ్రీకాంత్, వేముల మౌనికకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తన్నీరు మల్లికార్జున్, చింతకాయల రాము, జక్కుల నరేందర్, కోడి ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాసభ కరపత్రం ఆవిష్కరణ

మునగాల : మండల కేంద్రంలో ఆగస్టు 18న నిర్వహించబోయే భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) 5వ మండల మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం కోరారు. గురువారం మునగాలలో మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షేక్ దస్తగిరి, సహాయ కార్యదర్శి అల్లి నాగరాజు, సభ్యులు జాన్ పాషా, లింగయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్.. కాంగ్రెస్ కుట్ర

గరిడేపల్లి : బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగమేనని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గరిడేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ బిల్లు పేరుతో నయవంచనకు పాల్పడుతూ ముస్లింల రిజర్వేషన్ల కోసం డ్రామాలను షూరు చేసిందన్నారు.

టేకు మొక్కల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మోతె : మండలంలో రావిపహాడ్ క్లస్టర్ పరిధిలో 5 ఎకరాల పట్టా భూమి ఉండి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్న రైతులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టేకు మొక్కల కోసం దరఖాస్తు చేసుకోవాలని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని ఝాన్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రావిపహాడ్ క్లస్టర్‌కు ప్రభుత్వం 6,500 టేకు మొక్కలు అందిస్తుందని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన



పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా టీం సభ్యులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా టీమ్ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పోలీసుల పనితీరు, ప్రజలతో పోలీసుల ప్రవర్తన వంటి విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఐ.పరమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

హుజూర్‌నగర్ : ప్రతి ఇంట్లో చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 8, 9వ వార్డులలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మాజీ కౌన్సిలర్లు సీహెచ్.సౌజన్య, బి.ధనమ్మ, మున్సిపల్, మెప్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు సహకరించాలి

నేరేడుచర్ల : నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పున్నా నాగిని కోరారు. గురువారం నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేరేడుచర్ల, పాలకవీడు మండలాల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రెండు మండలాల్లోని 54 పాఠశాలల్లో గల 8569 మంది పిల్లలు, 38 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1135 మంది చిన్నారులల్లో 2 నుంచి 19 ఏళ్ల వారికి మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సల్వాది శ్రీనివాస్, సూపర్‌వైజర్ ధనమ్మ, మండల విద్యాధికారి పుట్లూరు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇరిగేషన్ ఉద్యోగి మృతి

కూసుమంచి : ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో సాగర్ ఔట్‌ఫాల్ కెనాల్ వంతెనపై గురువారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఇరిగేషన్ శాఖ ఉద్యోగి మృతి చెందాడు. కూసుమంచి ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం చెన్నారుగూడెం గ్రామానికి చెందిన బండ్ల హుస్సేన్(57) ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడు. విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై పాలేరు వస్తున్న ఆయన ఔట్‌ఫాల్ కెనాల్ వద్దకు రాగానే మధిర డిపో ఆర్టీసీ బస్సు వెనక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అవయవాలు ఛిద్రం కాగా హుస్సేన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన కుమారుడు అనిల్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కూసుమంచి ఎస్సై తెలిపారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు కళాకారుల నివాళి



మాట్లాడుతున్న ప్రజా కళాకారుడు నరసయ్య

గరిడేపల్లి : తుదిశ్వాస విడిచే వరకు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగిన వీరుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ అని ప్రజాకళాకారుడు నరసయ్య అన్నారు. గురువారం గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో గద్దర్ రెండవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు మైబు, తిరుపమ్మ, వేదస్వామి, జ్యోతి, ఝాన్సీ ఉన్నారు.